


# అంకుల్‌సామ్




**1992లో నా** పెద్ద మేనల్లుడు జె.ఎస్.ఆర్.ప్రసాద్ అమెరికా వెళ్ళేందుకు, నైతికంగా మద్దతుని ఇచ్చాను. ఆ సందర్భంలో మద్రాస్‌లో జెమినీ సర్కిల్‌లోని యు.ఎస్.కన్సలేట్ లైబ్రరీలో (యు.ఎస్.ఐ.ఎస్) అమెరికాకి వెళ్ళడానికి గల అన్ని వీసాల గురించి రచయిత, లాయర్ రేమన్ కేరియన్ క్షుణ్ణంగా రాసిన పుస్తకం యు.ఎస్.ఏ ఇమిగ్రేషన్ గైడ్‌ని చదివాను. ప్రసాద్ క్వాలిఫికేషన్ బిజినెస్ వీసానే సరైంది కాబట్టి దానిమీద వెళ్ళాడు. ఆ విధంగా నాకు అన్ని అమెరికన్ వీసాల గురించి తెలిసింది. వాటిలో ఓ వీసా నాకు ఆసక్తికరంగా అనిపించింది. అమెరికాకి వెళ్ళాక ఆ వ్యక్తి తిరిగి రాడని తెలిసీ ఇచ్చే నాన్ ఇమిగ్రెంట్ వీసా ఈ కె - 1 వీసా. ఆ వీసా ద్వారా నాటకీయత గల ఓ కథని సృష్టించగలిగాను.

1994లో ఆంధ్రప్రభ వారపత్రిక ఎడిటర్ శ్రీ వాకాటి పాండురంగారావు తమ వీక్లీకి నన్ను సీరియల్ అడిగారు. ఒకప్పుడు ఆంధ్రప్రభలో కథ పడితేనే సంతోషం కలిగేది. అలాంటిది వారే సీరియల్‌ని కోరి అడగడం సంతోషాన్ని ఇచ్చింది. ఆంధ్రభూమి ప్రజారంజకమైన సీరియల్స్ ప్రచురించిన ఎఫెక్టే ఇది. ఆయనకి కె -ఆ లేదా ఫియాన్సీ వీసా చుట్టూ అల్లుకున్న ఆ ప్రేమ కథని క్లుప్తంగా చెప్పాను. ఆయనకి అది నచ్చడంతో దాన్ని సీరియల్‌గా రాసాను. ఏ వారానికి ఆ వారం రాయడానికి ఆనాటి ట్రెండ్‌ని బట్టి ఆయన అంగీకరించారు.

అమెరికన్ గవర్నమెంట్‌కి అంకుల్ సామ్ అని పేరు. అమెరికన్ ప్రభుత్వంతో వీసా కోసం జరిగే నాటకీయ యుద్ధం ఈ నవల్లోని ప్రధాన భాగం. కాబట్టి దానికి అంకుల్‌సామ్ అనే పేరు పెడుతూ ఆ పేరు ఎలా వచ్చిందో కూడా నవల్లో వివరించాను. 1994 విజయదశమి సంచికలో ఆరంభమై, మార్చి 1995కి ఆరునెలల్లో ఇది పూర్తైంది. ఫిబ్రవరి 1995లో సీరియల్ ముగియడానికి రెండు వారాల మునుపే వాకాటిగారి అనుమతితో లిపి పబ్లికేషన్స్ దీన్ని పుస్తకంగా ప్రచురించింది. కాకతాళీయంగా వచ్చేనెలనించే కౌముదిలో ఇది సీరియల్‌గా పునఃప్రచురితం అవుతోంది.

స్థూలంగా కథ - శివయ్య మనవరాలు వాణిని తండ్రి పద్నాలుగో ఏట అమెరికానించి రాజమండ్రికి పంపుతాడు. కారణం వాణి స్టేన్లీ అనే అమెరికన్ యువకుడితో డేటింగ్ చేస్తూండటం. వాణిని చూసిన ముకుందం అనే గ్రాడ్యుయేట్ విద్యార్థి ప్రేమలో పడతాడు. కానీ దాన్ని ధైర్యంగా వ్యక్తం చేయలేడు. 'ఐ కాంట్ డ్రింక్ దిస్ మచ్ కాఫీ. ప్లీజ్ లెస్ ఇట్' లాంటి బట్లర్ ఇంగ్లీష్ మాట్లాడుతాడు. కొబ్బరి నూనెని తలకి రాసుకుని, పైకి దువ్వుకుంటాడు. మెడ జిడ్డవకుండా కాలర్ కింద ఎర్రటి జేబురుమాలుని ఉంచుకుని, సాక్స్ లేని బూట్లని తొడుక్కుని, గొట్టాం పేంట్ మీద ఎర్రటి ఎరుపు రంగు చొక్కా. అతన్ని చూసి వాణి నవ్వుకుంటుంది. మూడు వంతుల నవల్లో వాణికి అతను తనని ప్రేమిస్తున్నాడని తెలీదు. స్టేన్లీ తనని తను హోమోసెక్సువల్‌గా డిస్కవర్ చేసుకున్నానని చెప్పి విడిపోతాడు. వాణికి ఆ

సమయంలో ముకుందం ప్రేమ గురించి తెలిసినా ఆలస్యంగా స్పందిస్తుంది. ముకుందం ఆమె కోసం అమెరికాకి విద్యార్థిగా వెళ్ళాలని ప్రయత్నిస్తాడు. కానీ తన కూతురు అతన్ని ప్రేమిస్తోందని తెలిసిన వాణి తండ్రి అడ్డుపడటంతో వీసా రాదు. వాణికి తండ్రి చేసిన ద్రోహం తెలుస్తుంది. తండ్రీకూతుళ్ళ మధ్య కలతలు ఏర్పడి, చివరకి అది ఛాలెంజ్‌గా పరిణమిస్తుంది. ఆర్నెల్లలో ముకుందాన్ని తను యు.ఎస్.ఏకి రప్పిస్తే తన తండ్రి ముకుందం కాళ్ళు కడిగి తమ పెళ్ళిచేయాలని, లేదా తండ్రి చూపించిన సంబంధాన్ని తను ఎదురు చెప్పకుండా చేసుకుంటుందనే ఒప్పందానికి వస్తారు. అనే బిల్ క్లింటన్ స్వగ్రామమైన అర్కన్సాస్ రాష్ట్రంలోని 'హోప్' గ్రామంలో మేరేజ్ లైసెన్స్ తీసుకోవాలని వాణి నిశ్చయించుకుంటుంది. ఇది ఆమెలోని ఆశాభావాన్ని తెలియజేయడానికి రాసాను. వాణి ముకుందాన్ని రప్పించడానికి చేసే ప్రయత్నాలని తండ్రి ఎంత ప్రయత్నించినా పసికట్టలేకపోతాడు.

ఏ ప్రజాస్వామ్యంలోనైనా ప్రజలకి ఉన్న బలమైన ఆయుధం నిరసన. అమెరికాలో ఓ కొత్త పద్ధతిలో ముకుందానికి వీసా వచ్చేందుకు నిరసన ఏర్పాట్లని వాణి చేసుకుంటుంది. ఇందుకు ప్రేరణ 1990లో నేను అమెరికా వెళ్ళినప్పుడు వాషింగ్టన్ డిసిలో మెట్లమీద నిరసన చేస్తున్న స్టేఫీ ఎబ్నీ అనే వృద్ధుడ్ని చూసి మాట్లాడటం. అతని కథ నాకు ఎంతో ఆసక్తిగా అనిపించింది.

ఆనాటి అమెరికన్ ప్రెసిడెంట్ బిల్ క్లింటన్ కూడా ఈ నవల్లో ఓ పరోక్ష పాత్రని పోషించాడు. చివరకి ముకుందానికి వీసా రావడంతో కథ ఆనందంగా ముగుస్తుంది. అందుకు వాణి చేసిన వింత, వినూత్న ప్రయత్నం ఏమిటి? ఫలితంగా కొందరు అమెరికన్ పౌరుల మద్దతుతో వీసా ఎలా వచ్చింది? ఇవి చెపితే వచ్చేనెల నించి దాన్ని చదివే కౌముది పాఠకుల్లో ఉత్కంఠ పోతుంది. కాబట్టి ఆ భాగం స్పృశించను.

ఆ సమయంలో జ్యోతి మాసపత్రికలో పనిచేసే బాల అనే గుంటూరు జిల్లాకి చెందిన అతను మాటల్లో వాళ్ళ ఊళ్ళోని ఓ మోసగాడి గురించి చెప్పాడు. ఆ పాత్రని దాదాపుగా యథాతథంగా ఈ నవల్లో అగ్గిరాముడు పేరుతో రాసాను. మాయమాటల్లో పెట్టి, నమ్మించి, తన దినసరి ఖర్చులని సంపాదించడం అగ్గిరాముడి నిత్యవ్యాపకం

ఆ రోజుల్లో ఇప్పటిలా ఆంధ్రప్రదేశ్ నించి అమెరికాకి వెళ్ళే విద్యార్థుల సంఖ్య చాలా తక్కువ. ఎందుకంటే ఇన్ని ఇంజనీరింగ్ కాలేజీలు అప్పటికి రాలేదు. అమెరికాకి విద్యార్థిగా ఎలా వెళ్ళాలి? జిమేట్ కోర్స్ ఎలా ఉంటుంది? ప్రశ్నాపత్రం ఎలా ఉంటుంది? మొదలైన వివరాలన్నీ సేకరించి ఆ నవల్లో రాసాను. అప్పుడే మొదలైన 'విసు' కన్సల్టెన్సీకి చెందిన సి.సి.రెడ్డిగార్ని వ్యక్తిగతంగా కలిస్తే ఆయన ఆ వివరాలని చెప్పారు.

1995లో తెలుగు ప్రైవేట్ ఛానల్స్‌లో సీరియల్స్ శకం ఆరంభమైంది. అప్పటికే నావి అరడజను పైనే సీరియల్స్ జెమినీ ఛానల్లో ప్రసారం అయ్యాయి. నేను రాసిన 'విటమిన్ ఎం' నవలని లక్కీ ఛాన్స్‌గా తీసిన నిర్మాత ఫోన్ చేసి 'అంకుల్‌సామ్'ని టి.వి సీరియల్‌గా తీయాలని అనుకుంటున్నాయని, రైట్స్ నా దగ్గరే ఉన్నాయా అని అడిగారు. వేరే వారికి కమిట్ అయ్యానని చెప్పాను.

శివాజీ అనే నటుడు హీరోగా వచ్చిన ఓ సినిమా కథ, (సినిమా పేరు గుర్తులేదు) అలాగే రామ్ హీరోగా 2006లో వచ్చిన 'దేవదాసు' అనే సినిమా కథ స్వల్ప మార్పులతో అంకుల్‌సామ్‌ని పోలి ఉన్నాయని మిత్రులు చెప్పారు. ఆ రెండూ నేను చూడలేదు. నిర్మాతలు నా దగ్గర హక్కులు తీసుకోలేదు. కన్నడంలో కూడా ఇది అనువదించబడి 'ఉత్థాన' అనే మాసపత్రికలో సీరియల్‌గా వెలువడింది. మలి ముద్రణ రాలేదు. ప్రస్తుతం ఇది మార్కెట్లో లేదు.

Click here to share your comments on this story

www.anandbooks.com
www.telugubooks.in

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి